


# THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

## *(గత సంచిక తరువాయి)*

**మర్నాడు ఉదయం బెనర్జీ బ్రేక్ ఫాస్ట్‌కి ముందు** అలవాటుగా విస్కీ బాటిల్ కోసం చూసాడు. అది బీరువాలో యథాస్థానంలో లేదు. అనసూయని పిలిచి అడిగాడు.

"నేనే దాచాను" చెప్పింది అనసూయ.

"ఈ పాడు బుద్దులు ఎప్పటినుంచి నేర్చుకున్నావు?" అడిగాడు బెనర్జీ చిరాగ్గా.

"మా నాన్నగారు బ్రేక్ ఫాస్ట్‌కి వస్తున్నానని ఫోన్ చేశారు. పండక్కి పిలవడానికి కాదు. మీతో మాట్లాడాలంట."

"ఏ విషయం? నువ్వేమైనా నా మీద రిపోర్ట్ చేసావా?" నవ్వుతూ అడిగినా బెనర్జీ కంఠంలో కొద్దిగా కరుకుదనం ధ్వనించింది.

ఆ ప్రశ్నకి అనసూయ సమాధానం చెప్పలేదు. పావుగంట తర్వాత బెనర్జీ ఇంటి గేటులోంచి లోపలికి వచ్చి ఆగిందో పోలీస్ జీప్. అందులోంచి యూనిఫాంలో ఉన్న ఏ.సి.పి దిగాడు. లోపలికి నడిచాడు.

"రండి నాన్నగారు" ఆహ్వానించింది ఆయనకోసం ఎదురుచూస్తూ నిలబడ్డ అనసూయ.

"కారు షెడ్‌లోనే ఉంది. అల్లుడుగారున్నారుగా?" అడిగాడాయన.

"ఉన్నారు. మీ కోసమే ఎదురు చూస్తున్నారు" చెప్పింది అనసూయ.

ఇద్దరు లోపలికి నడిచారు. డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని 'ఎకనమిక్ టైమ్స్' దినపత్రిక చదువుతున్న బెనర్జీ మామగార్ని చూడగానే లేచి నిలబడ్డాడు.

"గుడ్ మార్నింగ్" విష్ చేసారాయన.

"గుడ్ మార్నింగ్" బదులుగా విష్ చేసాడు బెనర్జీ

ఇద్దరూ కూర్చున్నాక అనసూయ బౌల్స్‌లోని కార్న్‌ఫ్లేక్స్ మీద చక్కెర చల్లింది. వేడిపాలని రెండు బౌల్స్‌లోకి వంచింది.

"నువ్వూ కూర్చో తల్లీ" చెప్పాడాయన అనసూయతో.

ఆయన తనొచ్చిన విషయం గురించి వెంటనే ఎత్తలేదు.

వ్యాపారం ఎలా ఉంది? ఆరోగ్యం బావుందా? మీ అమ్మగారు కులాసానా? లాంటి రొటీన్ ప్రశ్నలు వేసాడు. కాఫీ తాగుతూ అసలు టాపిక్ లోకి వచ్చాడు.

"మీ ఇద్దరి పెళ్ళయి ఏడేళ్ళవుతోంది కదా?"

"వచ్చే ఫిబ్రవరికి ఏడేళ్ళు పూర్తవుతుంది." చెప్పాడు బెనర్జీ.

"మీరు ఫేమిలీ ప్లానింగ్‌ని ఇంకా అమలు చేస్తున్నారా?" అడిగాడాయన బెనర్జీ కళ్ళల్లోకిసూటిగా చూసూ.

అనసూయ ఆ ప్రశ్నకి సిగ్గుతో తలవంచుకుంది. బెనర్జీకి అర్థంకాలేదు ఆయన ఏం మాట్లాడదలుచుకున్నాడో.

"లేదు" చెప్పాడు.

"ఎప్పటినుంచి లేదు?" అడిగాడు అనసూయ తండ్రి వీరభద్రరావు.

"నాలుగేళ్ళనించనుకుంటాను."

"నాకు ఓ మనవడిని చూసుకోవాలని ఉందోయ్" చెప్పాడు వీరభద్రరావు.

బెనర్జీ బదులు మాట్లాడలేదు.

"ఇలాంటప్పుడు ఓసారి ఇద్దరూ డాక్టర్‌ని చూడటం మంచిది ఏమంటావు?" అల్లుణ్ణి ప్రశ్నించాడాయన.

బెనర్జీకి తెలుసు తనలో ఎలాంటి లోపం లేదని.

"సరే" చెప్పాడు.

వీరభద్రరావు కాసేపాగి చెప్పాడు.

"సాయంత్రం మా ఇంటికి రండి. డాక్టర్ దగ్గరకి తీసుకు వెళతాను రాత్రి మా ఇంట్లోనే భోజనం చేద్దురుగాని."

"భోజనానికి రాను కాని.." బెనర్జీ ఏదో చెప్పబోయాడు.

"మా ఇంట్లో నువ్వు భోజనం చేసి ఎంతకాలం అయిందో నీకు గుర్తుందా? ఇంకేం చెప్పక" అడ్డుపడ్డాడు వీరభద్రరావ్.

"అవునండి. మీ ఆఫీసు ఎక్కడికీ పోదు. మీ సెంట్ ఎక్కడికీ పోదు. రాత్రి భోజనానికి వెళదాం" చెప్పింది అనసూయ.

బెనర్జీ ఏమీ అనలేకపోయాడు.

"మీ నాన్నగారే బ్రతికి ఉంటే నాకు ఇకా బాధ్యతగా ఈ విషయాలు నీతో మాట్లాడాల్సిన అవసరం ఉండేది కాదు. ఆయన పోయాక నీ బాగోగులు చూడాల్సిన బాధ్యత నా మీదవుంది అనుకుని కల్పించుకోవలసి వచ్చింది" చెప్పాడాయన.

వీరభద్రరావు వెళ్ళిపోయాక అడిగాడు భార్యని.

"ఇది నీ ఆలోచనేనా? పిల్లలు పుట్టలేదని పరీక్ష చేయించుకుందామని డైరెక్ట్‌గా నాతో చెప్పొచ్చుగా?"

"మా నాన్నగారు ఈ టాపిక్ మాట్లాడేదాకా నాకు అసలా ధ్యాసే లేదు" చెప్పింది అనసూయ.

"పోన్లే ఇదీ ఒకందుకు మంచిదే" చెప్పాడు బెనర్జీ.

ఆఫీసుకి బయలుదేరబోతూ అడిగాడు.

"మీ నాన్నగారెళ్ళారుగా. జస్ట్. సెంట్‌లా ఓ స్మాల్ పెగ్ వేసుకుంటాను. బాటిల్ ఎక్కడ దాచావు?"

అనసూయ బెనర్జీ కాళ్ళకి సాక్స్ తొడుగుతూ చెప్పింది.

"మహానుభావా. మార్తాండ తేజ. మీరా కాస్త తాగకపోతే ఈ భూమి తిరగడం ఆగిపోదు సూర్యాస్తమయం కాదనే భయం లేదు. ఈ రోజయినా సోబర్‌గా వెళ్ళండి."

"నాకు అన్ని విషయాల్లో నచ్చుతావు కాని ఈ విషయంలో మాత్రం నువ్వంటే మా చెడ్డకోపం."

"సాయంత్రం అయిదున్నరకల్లా ఇక్కడుండాలి. ఆరింటికి మా ఇంటికి వెళ్ళాలి"

"ష్యూర్."

బెనర్జీ కారులో ఆఫీసుకి చేరుకున్నాడు. ఎప్పటిలానే జనరల్ మేనేజర్ విశ్వం కారు షెడ్‌లో ఉంది. బెనర్జీ కారు లాక్ చేసి తన గదిలోకి వెళ్ళాడు. దారిలో విజిటర్స్ రూములో పదిమందిదాకా అమ్మాయిలు కూర్చుని ఉండటం గమనించాడు. స్టోర్స్ సెక్షన్‌లోని అసిస్టెంటు పోస్ట్‌కి ఆ రోజు ఇంటర్వ్యూలన్న సంగతి గుర్తుకు వచ్చింది. దాంతో కాస్తంత హుషారు కలిగించిందతనికి.

విశ్వాన్ని ఇంటర్ కం లో పిలిచాడు. అతనొచ్చి బెనర్జీకి ఎదురుగా కూర్చున్నాడు.

"సెంట్ వేసుకున్నట్టు లేదివాళ?" అడిగాడు విశ్వం గట్టిగా వాసన పీల్చి నవ్వుతూ.

"లేదు"

"ఇంటర్వ్యూలున్నాయనా? ప్రారంభిద్దామా? నలుగురు కుర్రాళ్ళు. పదిమంది ఆడవాళ్ళు"

"అలాగే"

"అన్నట్టు రాధ అనే అమ్మాయికి ఉద్యోగం వచ్చేలా చూడమని సేల్స్‌టాక్స్ ఆఫీసర్ ఫోన్ చేసారు. వీలుంటే ఆ అమ్మాయిని సెలెక్ట్ చేద్దాం. ఆయనని మంచి చేసుకోవడం మంచిది"

"చూద్దాం."

ఇంటర్వ్యూలు మొదలయ్యాయి. ఒక్కొక్కరే లోపలికి రాసాగారు. ముందర నలుగురు మొగవాళ్ళని పిలిచారు. ఒకతను యం.ఏ పి.హెచ్.డి. ఇద్దరికి ఆ పోస్ట్‌లో రెండేళ్ళ అనుభవం ఉంది. నాలుగో అతను ఆడిటర్ రికమండేషన్ కాండిడేట్. ఆ తర్వాత అమ్మాయిలని ఇంటర్వ్యూ చేయసాగారు.

బెనర్జీ వాళ్ళు కూర్చునే విధానం, ప్రశ్నలకి సమాధానం చెప్పే పద్ధతిని బట్టి వాళ్ళ మనస్తత్వాన్ని అంచనా వేయసాగాడు. బాస్‌తో క్లోజ్‌గా ఉండేందుకు వప్పుకుంటారనే నమ్మకం గలవాళ్ళనే ఎన్నుకోవాలన్నది అతని ప్రాథమిక ధ్యేయం.

పదిమందిలో నలుగురు అసలు బాగాలేరు. దారిద్ర్యంవల్ల అసలు పోషణలేని శరీరాలు కొందరివయితే, పుట్టుకతోనే అందంలేనివాళ్ళు మరికొందరు. మిగతా ఆరుగురిలో నలుగురు షుమారుగా ఉన్నారు. ఓ అమ్మాయికి ఉద్యోగం చేయాల్సిన అవసరం లేకపోయినా, ఖాళీగా ఉండటం ఇష్టంలేక ఆ ఉద్యోగానికి అప్లయ్ చేసింది. ఇద్దరికి ఉద్యోగం ఎంతో అవసరం. మిగతావాళ్ళు వేరేచోట ఉద్యోగం చేస్తూ, అక్కడ జీతం చాలక ఇంటర్వ్యూకి వచ్చారు.

"మీ పేరు సుందరన్నారు కదా? మీరింత అందంగా ఉంటారని పేరు పెట్టేటప్పుడు మీ పెద్దవాళ్ళకి ఎలా తెలుసు?" అడిగాడు బెనర్జీ ఓ అమ్మాయిని.

ఆ అమ్మాయి జవాబుగా సిగ్గుపడటం మినహా సమాధానం చెప్పలేదు.

"ఆఫీసులో పని ఎక్కువగా ఉండి రాత్రి ఏడు, ఎనిమిది దాకా ఉండాల్సి వస్తే మీకేం అభ్యంతరం లేదుగా?" అడిగాడు విశ్వం.

"లేదు. అవసరాన్ని బట్టి ఉంటాను."

"పొద్దున్న వెళ్ళి రాత్రికి తిరిగి వచ్చే కేంప్‌లకి బాస్‌తో నువ్వు వెళ్ళాల్సిరావచ్చు. కారులో వెళ్ళి కారులో రావడమే. అందుకు మీ పెద్దవాళ్ళకి అభ్యంతరం ఉండదుగా..?"

కాసేపు సందేహించి సమాధానం చెప్పింది.

"ఉంటుంది"

"నీకా, మీపెద్దలకా?" అడిగాడు విశ్వం.

"మా నాన్నగారికి"

"నీకు లేదన్నమాటేగా?"

సుందరి సమాధానం చెప్పలేదు. చిన్నగా నవ్వింది.

మరో అమ్మాయి చాలా ఓపెన్ గా చెప్పింది తనకి 'ఎలాంటి' అభ్యంతరం ఉండదని, కాకపోతే తన అవసరాల్ని కూడా గుర్తించి తగిన 'అలవెన్స్' ఇవ్వాల్సి ఉంటుందని.

లంచ్ అవర్ కావడంతో ఆఖరమ్మాయిని లంచ్ అయేదాకా ఉండమని చెప్పమన్నాడు బెనర్జీ. ఇంటి నుంచి వచ్చిన కేరియర్‌ని తీసి పింగాణీ ప్లేట్‌లో భోజనం వడ్డించాడు ప్యూన్. మినరల్ వాటర్‌ని గ్లాసులోకి వంచాడు.

"ఓ పెగ్ పంచు" చెప్పాడు బెనర్జీ.

ప్యూన్ బీరువాని తెరచి అందులోని జానీవాకర్ బాటిల్‌ని తీసి మినరల్ వాటర్ లోకి విస్కీని వంచాడు.

"కింగ్ ప్రాన్స్ కర్రీ ఎక్కడిది?" అడిగాడు విశ్వం చనువుగా బెనర్జీ ప్లేటులోని ప్రాన్స్ కర్రీలోంచి ఓ ముక్కని అందుకుని తన ప్లేట్‌లో వేసుకుంటూ.

"వైజాగ్ నుంచి మా మామగారికి ఎవరో పంపారట - ఉదయం తెచ్చిచ్చారు."

"సిస్టర్ బాగా వండారు" చెప్పాడు విశ్వం.

"మా మామగారు రాత్రికి వాళ్ళింటికి భోజనానికి పిలిచారు"

"కింగ్ ప్రాన్స్ కోసమయినా వెళ్ళాలి. జీడిపప్పులా ఉంది రుచి" నవ్వాడు విశ్వం.

"భోజనానికి పిలిచింది నన్ను, అనసూయని డాక్టర్ చేత టెస్ట్ చేయించడానికి"

"ఏం టెస్ట్?" అడిగాడు విశ్వం ఆశ్చర్యంగా.

బెనర్జీ ఉదయం సంభాషణ టూకీగా చెప్పాడు.

"నీ రిపోర్ట్ విషయంలో ఎలాంటి ధోకా ఉండదు. అనేక మంది అబార్షన్‌ల కోసం నాకు తెలిసి నువ్వు పదివేలదాకా తగలేసావు..." నవ్వాడు విశ్వం.

"మా ఆవిడలో ఏదయినా లోపం ఉందేమో అని నేను చాలా సార్లు అనుకున్నాను. లేకపోతే తనకి ఎందుకు ప్రెగ్నెన్సీ రాదు?"

"ఒకోసారి చిన్న ఆపరేషన్ చేస్తే పిల్లలు పుడతారు" చెప్పాడు విశ్వం.

"లెట్స్ హోప్ సో" చెప్పాడు బెనర్జీ. విస్కీ మొత్తం తాగి.

కొన్ని క్షణాల తర్వాత అడిగాడు విశ్వం.

"ఆఖరిసారి అబార్షన్ కోసం నువ్వు ఖర్చుచేసి ఎంతకాలం అయింది? ఏడేళ్ళు కావటంలా?"

బెనర్జీ మనసులోనే లెక్కవేసుకుని చెప్పాడు.

"అవును ఏడేళ్ళ మీద నాలుగునెలలు."

"ఆ కాంపౌండర్ గారమ్మాయేగా?"

"ఆ తర్వాత వీణ మాష్టారుగారమ్మాయి."

"అవును. వాళ్ళ బందరు వెళ్ళిపోయారనుకుంటాను?"

మళ్ళీ ఇద్దరి మధ్యా కాసేపు నిశ్శబ్దం.

"కాంపౌండర్ గారమ్మాయి పేరు మైత్రి అనుఉంటాను?" అడిగాడు విశ్వం నవ్వుతూ.

"అవును. మైత్రి. అన్ని విషయాల్లో నాతో మైత్రిగా ఉండేది. చివరికి పెళ్ళి చేసుకున్నట్లు నటించాల్సి వచ్చింది. థాంక్స్ ఫర్ యువర్ హెల్ప్."

బెనర్జీ ఖాళీ గ్లాసులోకి విస్కీని వంచి, అందులోకి చల్లటి మినరల్ వాటర్‌ని వంచాడు. విశ్వం కూడా ఓ గ్లాసులోకి ఓ పెగ్‌ని వంచుకుని దాంట్లో ఏం కలుపుకోకుండా గ్లాసుని ఎత్తి, ముక్కు మూసుకుని ఒక్క గుక్కలో తాగాడు. గొంతు మండటంతో ముఖం వికారంగా పెట్టాడు. అది చూసి చిన్నగా నవ్వాడు బెనర్జీ.

బయట విజిటర్స్ గదిలో చేతి గడియారం వంక చూసుకుంటూ కూర్చుని ఉంది ఆఖరి కేండిడేట్. ఆమె వయసు ఇరవై తొమ్మిది. మొహంలో ఓ విధమయిన కళ, మంచి, చెడుని తూకం వేయగలిగే సమర్ధత కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. మెళ్ళో ఓ రోల్డ్‌గోల్డ్ గొలుసు తప్ప మరే ఆభరణాలు లేవు. కట్టుకున్న చీర కూడా చవకరకం నూలు చీర. ఆమెకి ఉద్యోగం ఎంతో అవసరం అనిపిస్తుంది. బొటనవేలు దగ్గర చిరిగిన కుడికాలి చెప్పునిచూస్తే ఆమెలో అందంతో పాటు ఎదుటి మనిషిని శాసించగలనన్న ధీమా కూడా చూపరులు గమనించగలరు. తన జీవితానికి సంబంధించిన నిర్ణయాలని పెద్దలతో సంప్రదించకుండా తనే తీసుకోగలదు అనిపించేలా ఎంతో గంభీరంగా ఉందామె మొహం.

"రెండూ ముప్పావు అవుతోంది అయ్యగారు ఇంకా పిలవలేదే?" అడిగిందా అమ్మాయి ప్యూన్‌ని.

"పిలుస్తారు" చెప్పాడతను నిర్లిప్తంగా.

"నేను భోజనం చెయ్యలేదింకా ఆకలేస్తోంది"

"అయ్యగారి భోజనం ఓ పట్టాన కాదు" మళ్ళీ అదే నిర్లిప్తతతో చెప్పాడు ప్యూన్.

"ఏనుగుల్ని తింటాడా, గుర్రాలని తింటాడా?" నవ్వింది ఆ అమ్మాయి.

బదులుగా సన్నగా నవ్వాడు ప్యూన్.

"నీ పేరు?" అడిగింది "రాజయ్య" చెప్పాడతను.

ఓ సారి తన హేండ్ బాగ్ తెరచి అందులోని సర్టిఫికెట్లన్ని సరిగ్గా ఉన్నాయో లేవో చూసుకుంది ఆ అమ్మాయి, హేండ్ కర్చీఫ్‌తో తన నుదుట పట్టిన చెమటని తుడుచుకుంది. మళ్ళీ చేతిగడియారం వంక చూసుకుంది.

"టీ తీసుకురానా?" అడిగాడు రాజయ్య.

తలవూపి, రూపాయి నోటు అందించిందతనికి.

రాజయ్య ఇంటర్ కంలో ఎవరితోనో చెప్పాడు. ఓ కప్పు టీ తీసుకురమ్మని.

"మీ అయ్యగారికి పెళ్ళయ్యింది కదూ?" అడిగింది కాసేపాగి.

తల ఊపాడతను.

లోపల గదిలో మూడో పెగ్ తీసుకుంటున్నాడు బెనర్జీ. విశ్వంతో అంతదాకా చూసిన వాళ్ళలో ఏ అమ్మాయి బావుందో ఏ అమ్మాయిని సెలక్ట్ చేయచ్చో చర్చిస్తున్నాడు.

"ఇంకో అమ్మాయి బయట వెయిట్ చేస్తోంది" గుర్తుచేసాడు విశ్వం.

"చేయనీ" చెప్పాడు బెనర్జీ నిర్లక్ష్యంగా.

"ఈ రాత్రికి ఎలాగూ డ్రింక్స్ తీసుకోవడం కుదరదు మామగారింటికి వెళుతున్నాను కాబట్టి. ఇంకో పెగ్ లాగిస్తే తృప్తిగా ఉంటుంది. 'అమృతా ఫుడ్ ప్రొడక్ట్స్' విశేషాలేమయినా కొత్తగా తెలిసాయా?" అడిగాడు.

"కొత్త టేప్ సాయంత్రం వస్తుంది" చెప్పాడు విశ్వం.

"బోర్డ్ మీటింగ్ టేప్ కదా అది."

"అవును."

"ఈసారి పబ్లిసిటీ కేంపైన్ కి వాళ్ళ బడ్జెట్ ఎంతో తెలిస్తే దాన్ని బట్టి మనది ప్లాన్ చేయవచ్చు" చెప్పాడు బెనర్జీ ఆలోచనగా.

"కనుక్కుంటాను" చెప్పాడు విశ్వం.

వాళ్ళిద్దరు వ్యాపారానికి సంబంధించిన అనేక విషయాలు మాట్లాడుకోసాగారు.

"నాలుగు పెగ్స్ పూర్తయ్యాయి" చెప్పాడు విశ్వం.

"ఇంకొక్కటి. ది వెరీలాస్ట్. దెన్ వి విల్ కాలిట్ ఏ డే"

ఆ ఫేక్టరీ గేటు బయట కృష్ణవేణిని ఆపి అడిగాడు వాచ్‌మేన్.

"ఎవరికోసం?"

"నా భర్త రాజులు ఇందులో పనిచేస్తున్నాడు. ఓసారి అర్జెంటుగా మాట్లాడాలి. టికెట్ నంబర్ -" తన భర్త నంబరు చెప్పింది. అతను వెరిఫై చేసి, ఇంటర్నల్ ఫోన్ లో రాజులుతో మాట్లాడాక, పాస్ రాసి కృష్ణవేణిని లోపలికి పంపాడు.

కృష్ణవేణి తన భర్తతో చెప్పింది, తన తల్లి ట్రీట్ మెంట్‌కి మర్నాటికి, రెండువందల ఏభై రూపాయిలు అవసరం అవుతాయని, ఎవర్నయినా బదులు అడిగి తీసుకోమని.

నిజానికి కృష్ణవేణి వచ్చింది అందుకోసం కాదు. అది మిష మాత్రమే. ఫేక్టరీలోని ఆడవాళ్ళ టాయ్‌లెట్ రూంలోకి వెళ్ళి తలుపు వేసుకుంది. తనతో తెచ్చిన కంఠానితో పెయింట్ చేసిన తలుపు లోపలి భాగంలో ఎంతో కసిగా ఇలా రాసింది.

నా పేరు బెనర్జీ

మంచంటే ఎలర్జీ

చెడు ఎంతో ఈజీ

మోసానికి మాష్టర్ జీ

అందులోంచి బయటకి వచ్చి మరో కేబిన్‌లోకి వెళ్ళి తలుపు వేసుకుని మళ్ళీ లోపల తలుపు మీద ఆ నాలుగు వాక్యాలు రాసింది. ఆడవాళ్ళ కోసం ప్రత్యేకింపబడ్డ అన్ని టాయిలెట్‌లలో లోపల ఆ వాక్యాలని రాసాక, వాచ్‌మేన్‌కి గేట్ పాస్ ఇచ్చి బయలుదేరింది. ఇప్పుడామెకి బెనర్జీ తనని చేసిన మోసానికి కలిగిన ద్వేషం కొద్దిగా తగ్గినట్లయింది.

అయిదో పెగ్ ఆఖరి గుక్క తాగాక బెల్ కొట్టాడు బెనర్జీ. రాజయ్య లోపలికి రాగానే చెప్పాడు.

"ఆఖరి కేండిడేట్‌ని పంపించు"

రాజయ్య బయ్‌టికి వెళ్ళి టీ తాగబోతున్న ఆ అమ్మాయి చెప్పాడు.

"పిలుస్తున్నారు. టీ వచ్చి తాగుదురుగాని"

వెంటనే టీ కప్పుని టేబుల్ మీద ఉంచి లేచి తలుపువైపు నడిచింది ఆ మ్మాయి.

ఇంటర్వ్యూ ఫైల్ అందుకుని అందులో ఆఖరి అప్లికేషన్ ఫారాన్ని బయటకు తీసి పేరు చూసాడు బెనర్జీ.

"మైత్రి!"

విశ్వం అతని వంక చూసాడు.

"ఆ మైత్రి, ఈ మైత్రి ఒకరే అయివుండవచ్చా? తండ్రి పేరు నారాయణరావు. ఆ కాంపౌండర్ పేరేమిటో గుర్తుందా?"

"లేదు. ఓసారి యాక్సిడెంటయితే ఆయన పనిచేసే హాస్పిటల్ లో అడ్మిట్ అయావు. నీకే గుర్తుండాలి."

తలుపు తెరుచుకుంది. లోపలికి అడుగుపెడుతున్న ఆ అమ్మాయి వంక విశ్వం, బెనర్జీ ఆసక్తిగా చూసారు.

లోపలికి వచ్చిన ఆ అమ్మాయి "నమస్తే" చెప్పింది ఇద్దరి చేతులు జోడించి.

విశ్వం బెనర్జీ వంక చూసాడు వెంటనే.

"కూర్చో. కులాసానా?" అడిగాడు బెనర్జీ చిరునవ్వుతో.

ఆ అమ్మాయి ఇద్దరివంకా పరిశీలనగా చూస్తూ వాళ్ళ ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది.

"నన్ను గుర్తుపట్టలేదా మైత్రి? బెనర్జీని" చెప్పాడు బెనర్జీ అదే చిరునవ్వుతో.

"ఇతను విశ్వనాధరావు. ఇద్దర్నీ గుర్తుపట్టాను" చెప్పింది మైత్రి నెమ్మదిగా.

"ఎలా ఉన్నావు? ఎంతకాలానికి?"

మైత్రి ఎలాంటి భావం లేకుండా ఇద్దర్నీ మార్చి మార్చి చూసింది.

"నువ్వు కొద్దిగా లావెక్కావు. అయిదారు కిలోల దాకా. అంతే. ఇంకేం మార్పులేదు నీలో" చెప్పాడు బెనర్జీ ఆమెని పరిశీలనగా చూసి.

"వాటే కో ఇన్సిడెన్స్!" చెప్పాడు విశ్వం.

"ఇంటర్వ్యూ ప్రారంభిస్తావా?" అడిగింది మైత్రి.

బెనర్జీ చిన్నగా నవ్వాడు. గ్లాసులోకి అతను విస్కీ వంచుకోవడం, లేచి ఫ్రిజ్ తెరచి అందులోంచి మినరల్ వాటర్ బాటిల్‌ని తీసుకుని, గ్లాసులోని విదిరిలోకి దాన్ని వంచుకోవటం, మళ్ళీ బాటిల్‌ని తీసుకుని, గ్లాసులోని విస్కీలోకి దాన్ని వంచుకోవటం, మళ్ళీ బాటిల్‌ని తీసుకుని, గ్లాసులోని విస్కీలోకి దాన్ని వంచుకోవటం, మళ్ళీ బాటిల్‌ని ఫ్రిజ్‌లో ఉంచి వచ్చి, రివాల్వింగ్ చెయిర్‌లో రిలాక్సింగ్‌గా కూర్చుని, గ్లాసులోంచి ఓ గుక్క తాగడం నిశ్శబ్దంగా గమనించింది మైత్రి.

చప్పుడు కాకుండా చిన్నగా నవ్వాడు బెనర్జీ. మైత్రి నిశ్చలంగా చూస్తుండిపోయింది అతని వంక. బెనర్జీ నవ్వుని ఆపి, మరో గుక్క తాగి, గ్లాసు టేబుల్ మీద ఉంచి చెప్పాడు.

"పాతఖాతాయేగా. ఇంటర్వ్యూ దేనికి అనవసరంగా? నీకు ఉద్యోగం అవసరం అనుకుంటే రేపే జాయిన్ అవచ్చు"

"థాంక్స్" చెప్పి లేచింది మైత్రి.

"కాని నేను పాతఖాతా అని నువ్వనుకుంటే పొరపాటే. మాయమాటలు నమ్మి ఉచ్చులో పడటానికి నేను ఇరవై రెండేళ్ళ మైత్రిని కాను. జీవితం అంటే ఏమిటో అనేక పాఠాలద్వారా నేర్చుకున్న ఇరవైతొమ్మిదేళ్ళ మైత్రిని"

బెనర్జీ మళ్ళీ పకపక నవ్వాడు.

"ప్రౌఢలంటే నాకు పిచ్చి వీక్‌నెస్. అదీగాక నువ్వు నా భార్యవి. సాక్ష్యం విశ్వనాధరావే. రేపు జాయిన్ అవు. ఇక వెళ్ళవచ్చు" చెప్పాడు.

మైత్రి నెమ్మదిగా లేచి బయటికి వెళుతున్నంతసేపు ఆ గదిలో బెనర్జీ, విశ్వంల నవ్వు ప్రతిధ్వనిస్తూనే ఉంది.

✷✷✷

*(ఇంకా ఉంది)*

Post your comments